సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఉత్సాహంగా 'చదువంటే మాకిష్టం'



కథలు పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

పెదగంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదువంటే మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ మేరకు గ్రంథాలయ శాఖాధికారి రమణ విద్యార్థులతో కథలు పుస్తకాలు చదివించారు. అందులోని నీతిని బోధించారు.

నూతన నియామకం



నియామక పత్రాన్ని అందుకుంటున్న పుల్లయ్యనాయుడు

పెదగంట్యాడ: ఏపీ కాపు, తెలగ, బలిజ ఉప కులాల జేఏసీ రాష్ట్ర లీగల్ ప్రెసిడెంట్‌గా దయాల్‌నగర్‌కు చెందిన సీనియర్ న్యాయవాది తెలగారెడ్డి పుల్లయ్య నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు.

శ్మశానవాటికలో పనుల పరిశీలన



శ్మశాన వాటికలో పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు

అగనంపూడి: జీవీఎంసీ నిధులతో వార్డులోని శ్మశాన వాటిక అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనా పనులు సత్వరం పూర్తి చేయాలని జీవీఎంసీ ఉన్నతాధికారులను 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు కోరారు. 79వ వార్డులోని అగనంపూడి (గళ్లవానిపాలెం) శ్మశాన వాటిక పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు పూర్తి అయితే కైలాసభూమిలో వసతుల లేమి ఉండబోదన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సత్యనారాయణ, గంగాభవానీ, సూరి, వెంకటరావు, సత్యారావు పాల్గొన్నారు.

రోగులకు వైద్య పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు, అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని జాలరిపల్లిపాలెంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా పోర్టు సీఎస్సార్ మేనేజర్ రమేష్‌బాబు మాట్లాడుతూ గత ఏడాది కాలంలో 12 శిబిరాలు నిర్వహించామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశామన్నారు. ఈ శిబిరంలో మొత్తం 160 మందికి సుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, వాణి, రాజు, కృష్ణవేణి, నాగమణి, డాక్టర్ సాయిచంద్, సత్తెయ్య పాల్గొన్నారు.

జీవీఎంసీ దఫేదార్ల ఆత్మీయ సమ్మేళనం

ఆరిలోవ: జీవీఎంసీ దఫేదార్ల అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ముడసర్లోవ పార్కులో ఘనంగా జరిగింది. సుమారు 150 మంది దఫేదార్లు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అతిథులుగా పలువురు జీవీఎంసీ అధికారులు పాల్గొని దఫేదార్లతో సరదాగా గడిపారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
గాజువాక
7997958388, 9912440606
సాక్షి

వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనే సీఎం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- భీమిలి 'సిద్ధం' సభపై హర్షం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: భీమిలి నియోజకవర్గం పరిధిలోని సంగివలసలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన 'సిద్ధం' సభ విజయవంతమైందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. ఈమేరకు సిద్ధం సభను విజయవంతం చేసిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సభకు గాజువాక నియోజకవర్గం నుంచి కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పెద్దఎత్తున తరలివెళ్లి ఎన్నికలకు మేము కూడా సిద్ధమని చాటి చెప్పారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీకే ప్రజలు పట్టం కట్టేలా పని చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని కోరారు. ఈ నెల 31న బీసీ రోడ్డుతో పాటు రత్న వారి వంటిల్లు జంక్షన్ నుంచి రూ.4కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు నగర మేయర్, జీవీఎంసీ కమిషనర్‌తో కలసి శంకుస్థాపన చేయనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మార్టుపూడి పరదేశి, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, భూపతిరాజు సుజాత, నాయకులు పల్లా చినతల్లి, ధర్మాల శ్రీను, బోగాది సన్యాసిరావు, భూపతిరాజు శ్రీనివాసరాజు, గొందేశి వెంకటరమణారెడ్డి, సంపంగి ఈశ్వరరావు, గంధ్రెడ్డి రామునాయుడు, రాజాన వెంకటరావు, ఎన్నేటి రమణ, బొడ్డ గోవింద్, వెంకటేష్, వెంపాడ అప్పారావు, అండిబోయిన అప్పారావు, రావాడ శివ, షౌకత్ ఆలీ, ఈశ్వరరావు, గొరుసు సత్యం, అప్పారావు, మామిడి శ్రీను, మంజుల, రామలక్ష్మి, అన్నవరం, గోవింద్, శ్రీను, ఉమ, జుత్తు లక్ష్మీ పాల్గొన్నారు.

ముగిసిన మేనేజ్‌మెంట్ డెవెలప్‌మెంట్ ప్రోగ్రాం



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి, వాసీవా అధ్యక్షుడు ప్రసాద్

అక్కిరెడ్డిపాలెం: ఎంఎస్ఎంఈల కోసం వారం రోజుల పాటు నిర్వహించిన మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎండీపీ) కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఎంఎస్ఎంఈ - డెవలప్‌మెంట్, ఫెసిలిటేషన్ కార్యాలయం, ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) విశాఖపట్నం సహకారంతో ఆటోనగర్‌లోని వాసీవాలో ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు నిర్వాహణ అభివృద్ధి కార్యక్రమాన్ని (ఎండీపీ) నిర్వహించింది. ట్రేడ్ మార్కుల నమోదు, జీఈఎం, ఉత్పత్తి ప్రమాణాలు, సోషల్ మీడియా మార్కెటింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో 19 మంది మహిళ పారిశ్రామికవేత్తలతో పాటు 30 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, స్టాండర్డ్స్ ప్రమోషన్ ఆఫీసర్ డి.కృష్ణవీర్ వర్మ, విశాఖపట్నం ఎంఎస్ఎంఈ - డీఎఫ్ఓ, ఏడీ, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ చంద్రమౌళి జంగం, వాసీవా కోశాధికారి పి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

30న పీఎం విశ్వకర్మ పథకంపై వర్క్‌షాపు

అక్కిరెడ్డిపాలెం: పీఎం విశ్వకర్మ పథకంపై వర్క్‌షాపును పెందుర్తిలోని మహిళా ప్రగతి కేంద్రంలో ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) జనరల్ మేనేజర్ సీహెచ్.గణపతి, ఎంఎస్ఎంఈ ఏడీ, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఎ.శ్రీను ఆదివారం తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై వర్క్‌షాపును భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ అభివృద్ధి సదుపాయాల కల్పన కార్యాలయం, జిల్లా పరిశ్రమల శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా గ్రామ పంచాయతీ శాఖ, కామన్ సర్వీసెస్ సెంటర్, లీడ్ బ్యాంక్‌ల సంయుక్తంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలను నమోదు చేసుకునే వారు పీఎం విశ్వకర్మ జిల్లా పరిశ్రమల కేంద్రం దగ్గరలో ఉన్న కామన్ సర్వీస్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. స్వయం ఉపాధి రంగంలో కుటుంబ ఆధారిత వ్యాపారంలో నిమగ్నమైన చేతి పరికరాలు చేసే వృత్తిదారుల కోసం వర్క్‌షాప్ ఆన్ పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ రిజిస్ట్రేషన్ సంబంధిత వృత్తిదారులు పాల్గొని ప్రధానమంత్రి పీఎం విశ్వకర్మ పథకం ద్వారా వచ్చే లబ్ధిని పొందాలని కోరారు. వివరాలకు జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) జీఎం సీహెచ్.గణపతిని, ఎంఎస్ఎంఈ ఏడీ ఎ.శ్రీనుగానీ సంప్రదించాలని కోరారు. వివరాలకు 9650519787 నంబర్లో సంప్రదించాలన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



యారాడ అగ్రిగోల్డ్ పార్కులో పూర్వ విద్యార్థుల సందడి

పెదగంట్యాడ: పూర్వ విద్యార్థులు సందడి చేశారు.. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆలింగనం చేసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997-98లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు యారాడలోని అగ్రిగోల్డ్ పార్కులో ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామని చెప్పారు. అలాగే తమతో పాటు కలసి చదువుకున్న సహచర మిత్రులు ఆర్థిక సమస్యలతో బాధపడుతుంటే ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామన్నారు. ముందుగా తమతో కలిసి చదువుకుని మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పీత నాగరాజు, ఈశ్వరరావు, మహ్మద్ వల్లీ, గోవింద్, బోగేష్, వెంకటేష్, కండిపల్లి సత్యనారాయణ, గొందేశి అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐఐఐఈ ఆవిర్భావ దినోత్సవం



ఐఐఐఈ నూతన కార్యవర్గం

ఉక్కునగరం: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ (ఐఐఐఈ) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 'సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా పారిశ్రామిక ఇంజినీరింగ్ పాత్ర' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథి, నేషనల్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ ఏవీవీ ప్రసాదరాజు సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ పాత్రను వివరించారు. వక్తలు బీవీ విశ్వనాథన్, దువ్వ రామకృష్ణ ఇన్నోవేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర అంశాలపై మాట్లాడారు. అనంతరం జరిగిన కార్యవర్గ నియామకం ప్రకియలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం జి.గాంధీ కౌన్సిల్ చైర్మన్, ఎస్.వి.ఎస్. రాజు వైస్ చైర్మన్, కె.వి.ఎల్.ఎన్. మూర్తి కోశాధికారి, ఎస్. సుందరం సంయుక్త కార్యదర్శి తదితర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చైర్మన్ వి. నారాయణన్ పాల్గొన్నారు.

7న చలో ఢిల్లీ



పెదగంట్యాడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వచ్చే నెల 7న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకులు గొందేశి సత్యారావు, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఉక్కు సీడబ్ల్యూసీలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కోసం ఎంతోమంది ఇళ్లు, భూములు కోల్పోయి నిర్వాసితులుగా మిగిలారని, వారికి ఎటువంటి ఉపాధి కల్పించకపోవడంతో ఇళ్లల్లో పాచి పనులు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టేటజికల్ సేల్ పేరుతో స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయడానికి చూస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల్లో విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ప్రకటనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం వచ్చే నెల 7, 8 తేదీలలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి నిర్వాసితులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్టా రెడ్డి, యలమంచిలి చిన అప్పారావు, నందికి తాతారావు, నమ్మి రమణ, శ్రీనివాసరావు, కణిత అప్పలరాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ విజేత కస్టమర్స్ ఎలెవెన్



ఇరు జట్లకు ట్రోఫీలు అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ మొహంతి

ఉక్కునగరం: ఉక్కు స్టేడియంలో స్టీల్‌ప్లాంట్ ఎలెవెన్, కస్టమర్స్ ఎలవెన్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో కస్టమర్స్ ఎలెవెన్ జట్టు గెలుపొందింది. కస్టమర్లతో సత్సంబంధాల పెంపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం టీ-20 క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఎలెవెన్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొదటి బ్యాటింగ్ చేసిన కస్టమర్స్ ఎలెవన్ జట్టు 20 ఓవర్లకు మూడు వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన స్టీల్‌ప్లాంట్ ఎలెవెన్ జట్టు 20 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 131 పరుగులు మాత్రమే చేసింది. స్టీల్‌ప్లాంట్ జట్టుకు డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి కెప్టెన్‌గా వ్యవహరించగా కస్టమర్స్ జట్టుకు నగేష్ కెప్టెన్‌గా జట్టుకు నేతృత్వం వహించారు. అనంతరం డి.కె. మొహంతి, నగేష్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు. స్టీల్‌ప్లాంట్ జట్టుకు చెందిన డాక్టర్ నవీన్ బెస్ట్ బ్యాటర్‌గా, కస్టమర్స్ జట్టుకు చెందిన రామారావులు బెస్ట్ బౌలర్‌గా బహుమతులు అందుకున్నారు.

స్క్రాప్ వాహనాలకు నిప్పు

మందుబాబుల పనే అంటున్న క్రీడాకారులు



మంటల్లో కాలిపోయిన వాహనాలు

జగదాంబ : ఆకతాయిల చేష్టల కారణంగా రెండు స్క్రాప్ వాహనాలు మంటల్లో కాలిపోయాయి. జీవీఎంసీ 35వ వార్డు ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జీవీఎంసీకి చెందిన స్క్రాప్ వాహనాలు పెడుతూ ఉంటారు. అయితే కొందరు వ్యక్తులు స్టేడియం లోపలికి వచ్చి మద్యం సేవించడం, గంజాయి తాగడం వంటి పనులు చేస్తు బీభత్సం సృష్టిస్తుంటారు. అలాగే ఆదివారం కూడా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మద్యం, గంజాయి సేవించి స్టేడియంలో ఉన్న రెండు స్క్రాప్ వాహనాలకు నిప్పు పెట్టి వెళ్లిపోయారు. మంటలు వ్యాపించడం చూసిన సమీపంలోని వ్యక్తులు అగ్నిమాపక కేంద్రం అధికారులకు ఫోన్ చేయడంతో వారు వచ్చి మంటలార్పి పరిస్థితి అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే ఒక వాహనం పూర్తిగా మంటల్లో కాలి బూడిదైపోగా, రెండవది సగం వరకు కాలిపోయింది. జీవీఎంసీ అధికారులు సెక్యూరిటీ ఏర్పాటు చేయకపోవడం వల్లే ఆకతాయిలు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నట్లు స్థానికులు, క్రీడాకారులు చెబుతున్నారు.

విమ్స్‌లో రోగుల రద్దీ



విమ్స్‌లో ఓపీ గదుల వద్ద నిరీక్షిస్తున్న రోగులు, వారి బంధువులు

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో రోగుల సంఖ్య కొద్ది రోజులుగా పెరుగుతోంది. రోగులతో పాటు వారికి సహాయంగా వచ్చే బంధువులతో ఇక్కడ ఓపీ గదులు కిటకిటలాడుతున్నాయి. ఇక్కడ అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉండటం, వివిధ రకాల పరీక్షలు చేస్తుండడంతో రోగులు విమ్స్‌ను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. అలాగే తక్కువ ధరకు ఎక్స్‌రే, రక్త పరీక్షలు, స్కాన్‌లు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఇక్కడ ఓపీ సంఖ్య ఇటీవల పెరిగింది. గతంలో రోజుకు 500 లోపు ఓపీ ఉండేది. ఇప్పుడు ఓపీ సంఖ్య పెరిగి 600-700 మధ్య నమోదవుతోంది. నగరంతో పాటు విజయనగరం, శ్రీకాకుళం, తుని, రాజమండ్రి ప్రాంతాల నుంచి సైతం రోగులు వచ్చి విమ్స్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, ఫిజియోథెరపీ, డెంటల్, జనరల్ విభాగాలలో ఎక్కువగా రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. వీటికి సంబంధించిన శస్త్ర చికిత్సలే ఇక్కడ ఎక్కువగా జరుగుతున్నాయి.

ఘనంగా బల్లల పండగ



బల్లల పండగలో పాల్గొన్న కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి



బల్లల పండగ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఉరుకూటి చందు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో రజకుల బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. ఆదివారం రజక అభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన పండగలో వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో రజకుల అభ్యున్నతికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు బల్లంకి అప్పారావు, పట్నాల అప్పారావు, తోకాడ రామారావు, పట్నాల సాధూరావు, వీరేసీ రామారావు, పట్నాల కనకరాజు, పట్నాల అప్పలరాజు, పాపారావు, ప్రసాదు, శంకర్రావు, గిడితూరి అప్పారావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రజక సేవా సంఘం ఆధ్వర్యంలో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి రజకవీధిలో రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పండగ ఆధ్యాత్మికంగా నిర్వహించారు. ఏటా రజకులు వారి జీవనాధారం అయిన బల్లలకు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. అయితే ఈ కార్యక్రమానికి గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఉరుకూటి చందు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేసి పండగను ప్రారంభించారు. ఈ సందర్భంగా విచ్చేసిన ఉరుకూటి చందును సంఘ ప్రతినిధులు సత్కరించారు. అనంతరం చందు మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ కోమటి శ్రీనివాసరావు, మార్పు శేషు, వాండ్రసి వెంకటరావు, మాడక నర్సింగరావు, గంధవరపు మురళీకృష్ణ, పిడిమ కృష్ణ, కింతాడ రాజేష్, వాండ్రసి రమేష్, కశింకోట అప్పలరాజు, మడక ఈశ్వరరావు, సుదమళ్ళ శివ, గర్భాన శ్రీను, నున్న అప్పారావు, కురివాడ రమేష్, మనేపల్లి ప్రసాద్, ఏలూరి రాంప్రసాద్, వాండ్రసి గోవిందు, బొడ్డ సూరిబాబు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బంగారుమాంబ అమ్మవారి పరస



బంగారు మాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు గ్రామ దేవత శ్రీ బంగారు మాంబ అమ్మవారి పరస మహోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం అమ్మవారిని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్యలు దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేకువ జామునే గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి ఆలయానికి చేరుకొని పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పరిసరాలన్నీ వివిధ రకాల స్టాళ్లతో సందడి నెలకుంది. అమ్మవారి సన్నిధిలో గరిడి నిర్వహించి దీపారాధన చేపట్టారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, మాజీ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ జి.వి.కృష్ణారావు, నగర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గవర వెంకట రమణారావు, నాయకులు గంధ్రెడ్డి రామునాయుడు, సంద్రాన చినసన్యాసిరావు, పల్లెల శ్రీను, ఆకుల ఉపమాక, కరణంరెడ్డి శ్రీను, గోపిశెట్టి వెంకటరావు, బోగాది అప్పారావు, నారిపట్టి బంగారయ్య, గోపిశెట్టి రామకృష్ణ, సంద్రాన వెంకటరావు, ఆలయ కమిటీ ప్రదినిధి గోపిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన పరసమహోత్సవంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రను తిప్పికొట్టాలి



ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బకొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న జరుగుతున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 1081 రోజులకు చేరుకున్నాయి. దీక్షల్లో హెచ్ఎంఎస్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నేతలు మాట్లాడుతూ ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ఇక పై అటువంటి ప్రయత్నాలను విరమించుకోవాలని హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తోందని, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడమే కాకుండా ప్రభుత్వరంగ సంస్థలను నాశనం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరును మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనక తప్పదన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు



రక్తదానం చేస్తున్న యువకులు

గాజువాక: స్థానిక ఎస్వీర్ సిల్వర్ బల్క్ హోల్‌సేలర్ సంస్థ ఆధ్వర్యంలో యువకులు ఆదివారం స్వచ్ఛంద రక్తదానం చేశారు. వందే భారత్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో బీసీ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 40 మంది యువకులు రక్తదానం చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన బ్లడ్ బ్యాంక్ నిర్వాహకుడు వినోద్ బాలు మాట్లాడుతూ ప్రాణమంతా రక్తంలోనే ఉంటుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రక్తదాన శిబిరం నిర్వాహకులు శ్రీరామ్, అజయ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలొద్దు

పెదగంట్యాడ: రక్తదానంపై అపోహలొద్దని, ప్రతి ఒక్కరూ రక్తాన్ని దానం చేయాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. రాఘవరెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో వుడా కాలనీలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా గల మైదానంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడారు. రక్తం కొరత కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి వారిని రక్షించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం పలువురు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యతో పాటు మానవీయ విలువలు అవసరం



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయి విద్యావిహార్ 38వ వార్షికోత్సవం ఆదివారం ఎంవీపీ కాలనీలోని పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ బసంత్‌కుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యా విహార్ విద్యార్థుల సేవా దృక్పథం వెలకట్టలేనిదన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు సామాజిక స్పృహ, సేవా నిరతిని అందిస్తున్న శ్రీసత్యసాయి విద్యా సంస్థ కృషి అభినందనీయమన్నారు. నేటి సమాజంలో విద్యతో పాటు మానవీయ విలువలు అత్యంత అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్కూల్ ప్లాస్ ప్రత్యేక సంచికను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కౌసల్య, సత్యసాయి విద్యా విహార్ విద్యార్థిని, గాయని శిరీషాతో పాటు పలువురు సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గాజువాక
9912222749, 9705347420
Office mail : sakshiadvtvsp@gmail.com